

నార్కట్‌పల్లి పట్టణంలోని 2వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- నార్కట్‌పల్లిలో ఎన్నికల ప్రచారం

నార్కట్‌పల్లి, అక్టోబర్ 22 : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లి పట్టణంలోని 2, 3వ వార్డుల్లో ఆదివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమ దిద్ది మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రైతు, కార్మిక పక్షపాతిగా, దివ్యాంగులు, వృద్ధులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం ఉందని అందుకు కారు గుర్తుకే ప్రతీ ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, ఎంపీటీసీలు దుబ్బాక పావనీశ్రీధర్, పుల్లెంల ముత్తయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

### వెలిమినేడును మండలం చేయాలని వినతి

చిట్యాల: వెలిమినేడును మండలం చేయాలని కోరుతూ వెలి మినేడు మండల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు వినతిపత్రం అందజేశారు. దేశబోయిన నర్సింహ, పాలగోని శివప్రసాద్, అడెపు మహేశ్, గణేశ్ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. చిట్యాల పట్టణానికి చెందిన దూదిమెట్ల రమేశ్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆయన నివాసానికి వెళ్లి ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, పొన్నం లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చిరుమర్తిని భారీ మెజార్టీతో గెలిపించాలి



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో నాయకులు

రామన్నపేట, అక్టోబర్ 22 : నకిరేకల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, వెల్లంకి సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో ఆదివారం బీఆర్‌ఎస్ గ్రామశాఖ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పున్న వెంకటేశం, ప్రధానకార్యదర్శిగా పిట్ట మహేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బూత్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గడపగడపకు వెళ్లి వివరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుదన్నారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి పోశబోయిన మల్లేశం, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఎన్నం బాలమణి, బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు బుడ్డా భిక్షం, నకిరేకంటి అశోక్, కర్రె రమేశ్, ఎడ్ల నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీఆర్‌ఎస్ కట్టంగూర్ మండలాధ్యక్షుడు ఏడుకొండలు, జడ్పీటీసీ బలరాములు

కట్టంగూర్, అక్టోబర్ 22: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఊట్కూరి ఏడుకొండలు, జడ్పీటీసీ తరాల బలరాములు అన్నారు. మండలంలోని ముత్యాలమ్మగూడెంలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలు సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చిరుమర్తి గెలుపు కోసం సమష్టిగా పని చేయాలని సూచించారు.

సమావేశంలో ఎంపీటీసీ మల్లెబోయిన శ్రీలతాకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ కట్టాజానకీరెడ్డి, అమరోజు నర్సింహ, యాదయ్య, వెంకన్న, పటేల్ వెంకట్‌రెడ్డి, రవి, అభిమన్యు, అంజయ్య, శంకర్ పాల్గొన్నారు.

## నేడు విజయ దశమి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శమీ పూజకు ఏర్పాట్లు

రామగిరి, అక్టోబర్ 22: చెడుపై 'మంచి' సాధించిన విజయానికి ప్రతీకగా చెప్పుకునే విజయదశమి వేడుకను సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు జరుపుకోనున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉండే వారంతా తమ స్వస్థలాలకు చేరుకోవడంతో ఆ ప్రాంతాలు సందడి వాతావరణం నెలకొంది. అన్ని ప్రాంతాల్లో శమీపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మరో వైపు ఆలయంలో విశేష పూజలు జరుగనున్నాయి. విజయదశమి(దసరా) పం డుగను సోమవారం నిర్వహించుకోవాలని తెలంగాణ ధూప, దీప నైవేద్య అర్చక పథకం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా కన్వీనర్ పెన్నామోహనశర్మ ఆదివారం వేర్వేరుగా ఆదివారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని సిద్ధాంతులు, పంచాంగకర్తలు, జ్యోతిష్య పండితులు ఒకే వేదికపై తెలంగాణ విద్వత్సభ పేరుతో ధార్మిక సంస్థను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం పండుగలను నిర్ణయిస్తున్నట్లు తెలిపారు.



చౌటుప్పల్ పట్టణంలో హైవేపై వాహనాల రద్దీ

### చౌటుప్పల్‌లో వాహనాల బారులు

చౌటుప్పల్ : దసరా పండుగ నేపథ్యంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలు ఆదివారం బారులు తీరాయి. పండుగకు ప్రజలు సొంతూర్లకు వెళ్లడంతో ఈ ట్రాఫిక్ రద్దీ నెలకొంది. దసరా పండుగ ఒకే రోజు ఉండటంతో వాహనాల తాకిడి ఎక్కువైంది. ప్రయాణించిన వాహనాల్లో కార్లే అధిక సంఖ్యలో ఉన్నాయి. ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఈ ట్రాఫిక్ రద్దీతో స్థానిక బస్టాండ్, తంగడపల్లి, వలిగొండ క్రాస్ రోడ్ల వద్ద రోడ్డు దాటాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పట్టణంలో సర్వీసు రోడ్ల వెంట సందడి నెలకొంది.

# అల్లరి
ALLARI



## విజయదశమి
కథ

**పూర్వం** మహిషాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మదేవుడి గురించి తీవ్రమైన తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన బ్రహ్మ.. ''ఏ వరం కావాలో కోరుకో!'' అన్నాడు. దానికి మహిషుడు.. ''నాకు ఏ పురుషుడి చేతిలోనూ మరణం లేకుండా వరం ఇవ్వు స్వామీ!'' అని కోరుకున్నాడు. బ్రహ్మ ''తథాస్తు!'' అనడంతో.. మహిషుడికి ఎక్కడలేని అహంకారం పెరిగిపోయింది. ఈ వరం కోరుకోవడం వెనుక మహిషాసురుడి ఉద్దేశం.. ఆడవాళ్లు తనను ఏమీ చేయలేరనే అహంకారమే! కానీ, ఆ అహమే తనను అంతం చేస్తుందని అతడు తెలుసుకోలేకపోయాడు. వరం పొందిన మహిషుడు దేవతలను, ప్రజలను హింసించేవాడు. దాంతో వారంతా త్రిమూర్తుల దగ్గరికి వెళ్లి మొరపెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మ – విష్ణు – మహేశ్వరులు.. ''మేము మహిషుణ్ని అంతం చేయలేము. అది బ్రహ్మ ఇచ్చిన వరం! కానీ, ఒక మహిళ చేతిలోనే మహిషుడు అంతమవుతాడు!'' అని చెప్పారు. దాంతో ఇంద్రాది దేవతలంతా కలిసి త్రిమూర్తుల సహాయంతో.. 18 చేతులు కలిగిన ఒక స్త్రీ శక్తి రూపాన్ని సృష్టించారు. ఆ శక్తికి విష్ణుమూర్తి సుదర్శన చక్రాన్ని, శివుడు త్రిశూలాన్ని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని సమర్పించారు. అలా దేవతలంతా తమతమ ఆయుధాలను ఆ శక్తికి సమర్పించారు. అలా 18 చేతుల్లో మారణాయుధాలను ధరించిన ఆ శక్తే.. దుర్గామాతగా అవతరించింది. ఈ ఆయుధాలకు తోడు అత్యంత శక్తి గల వాహనం సింహాన్ని కూడా సమర్పించారు. అలా సకల ఆయుధాలతో మహిషాసురుడితో యుద్ధం ప్రారంభించింది దుర్గాదేవి. ఆ యుద్ధం తొమ్మిది రోజులు సాగింది. చివరికి అమ్మవారు పదో రోజున మహిషుణ్ని సంహరించింది. యుద్ధం చేసిన ఆ తొమ్మిది రోజులే దేవీ నవరాత్రులుగా మారాయి. మహిషుణ్ని సంహరించినందున, దుర్గామాత విజయానికి గుర్తుగా.. పదోరోజు విజయదశమిగా మారింది. దశమి రోజున విజయం సిద్ధించింది కాబట్టి.. ప్రజలంతా ఈ రోజును విజయదశమిగా జరుపుకొంటారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తే.. దసరా పండుగ.

### తెలుసుకుందాం




1. రామాయణంలో రావణుడిపై విజయం సాధించడానికి రాముడు ఏ పూజ చేశాడు?
   – దుర్గాపూజ
2. పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేముందు తమ ఆయుధాలను ఏ చెట్టుపై ఉంచారు?
   – శమీ వృక్షం (జమ్మి చెట్టు)
3. దసరా పండుగను మొత్తం ఎన్ని రోజులు జరుపుకొంటారు?
   – పది రోజులు

### శ్లోకం



శమీ శమయతే పాపం
శమీ శత్రు వినాశనం
అర్జునస్య ధనుర్ధారి
రామస్య ప్రియదర్శిని||

### మంచిమాట



ధనం రూపంలో లక్ష్మీదేవి ప్రపంచాన్ని పోషిస్తున్నది. జ్ఞానం రూపంలో సరస్వతీ మాత ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తున్నది. శక్తి రూపంలో దుర్గామాత ప్రపంచాన్ని నడిపిస్తున్నది. కాబట్టి, వేర్వేరు రూపాల్లో కనిపించినా.. ఈ ముగ్గురూ ఒక్కరే. ఆమే.. అందరికీ జగన్మాత!


### విటీర్ హ్యాండ్స్

ఏనుగుల యోగేందర్
ఖమ్మం



### రంగులేయండి

కింద ఇచ్చిన 'రావణ దహనం' బొమ్మకు రంగులేయండి.



### చెప్పుకోండి

దసరా పండుగ రోజున ఈ పిట్టను చూడటం శుభ సూచకంగా భావిస్తారు. ఇంతకీ ఇది ఏ పిట్ట?



జవాబులు :

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా :
zindagi@ntnews.com